భ్రమ

"అమ్మా! నేను ఆఫీసుకు పోతున్నాను" అన్నాడు పరమశివన్. అతడు భోజనం పూర్తి చేసుకుని చొక్కామీద గచ్చకాయరంగు కోటు తొడుక్కుని చేతిలో ఫైళ్ళతో వరండాలోకి వచ్చాడు. లోపల తలుపు పక్కనే ఉన్నది మీనాక్షి. వేదమ్మకు రాత్రి అంతా జ్వరం. కాని తెల్లవారేసరికి తగ్గింది. ఆమె ఓపిక చేసుకుని ప్రక్క ఇంటి వర్ధనమ్మ గారితో ఆ కబురూ ఈ కబురూ చెప్పి వస్తున్నదల్లా ఆ చిన్న వరండాలో పక్కకు తప్పుకుని "మంచిది, నాయనా!" అన్నది.

అంతలోనే మళ్లీ ఏదో గుర్తుకు రాగా "ఈ వేళయినా ఆ చంద్రప్పన్‌కు ఉత్తరం రాయి, పరమూ!" అన్నది కొడుకుతో.

అతడు తలఊపి చెప్పులు తొడుక్కోబోయి నాలిక కరుచుకుని, "అరెరె! మరిచేపోయాను మీనాక్షీ! నిన్న రాత్రి ఈ చెప్పు తెగింది. వీటితో ఇహ లాభం లేదు. నడవటం కష్టం" అంటూ నవ్వి, చెప్పులను కాళ్ళతో ఒక మూలకు తోసి, వట్టి కాళ్ళతోనే నడిచి మెట్లు దిగి వీధిలోకి వెళ్ళిపోయాడు.

మీనాక్షి లోపలికి వెళ్ళిపోయింది. వేదమ్మ వరండాలో చాపమీద కూర్చున్నది.

బయట రోడ్డుమీద గొప్ప సంచలనం, రొద.

రోజూ తెల్లవారకముందే జీవితపు హడావిడి మొదలవుతుంది. బస్సులూ, లారీలూ, కార్లూ, రిక్షాలు ఎడతెగకుండా వస్తూ పోతూవుంటాయి. జనం పిన్నా పెద్దా అందరూ ఇరవై నాలుగు గంటలూ ఉరుకులు, పరుగులు పెడుతూ గొడవ చేస్తూ తిరుగుతూ ఉంటారు. జనం చేసే రణగొణ ధ్వనితో, బస్సుల హారన్ల మోతతో, రిక్షా గంటల గణగణలతో మొత్తం మీద తెల్లవారింది మొదలుకొని రాత్రి బాగా పొద్దుపోయే వరకు చెవులకు విశ్రాంతి అనేది ఉండదు.

వేదమ్మ అలానే కూర్చుండిపోయింది. లోపల కోడలు పనిలో ఉన్నట్టున్నది. వరండా ముందున్న కొద్ది గజాల ఆవరణలో ఒకేఒక చిన్న దానిమ్మ చెట్టున్నది. దానికి అయిదారు ఎర్రని పూలు పూచి ఉన్నాయి. సిమెంటు రాళ్ళ గోడమీద బుల్లిపిట్ట ఒకటి ఎక్కడినుంచో ఎగిరివచ్చి రాగాలు తీస్తున్నది. కాని, దాని గొంతు కీచుగా ఉండి సరిగా వినబడటమే లేదు. ఎదురుగా పెద్ద మేడ. ఆ పక్కన పొడుగాటి గుబురుచెట్ల మధ్యగా కొంచెం ఆకాశం – మబ్బులేని ముక్క – కనిపిస్తున్న దంతే.

వేదమ్మకు అంతలో తన ఊరు గుర్తుకు వచ్చింది. నిజానికి ఆమె తన ఊరినీ, తన ఇంటినీ మరచిపోయిం దెక్కడ? అరవదేశంలో ఎక్కడో మారుమూల సముద్ర తీరాన చిన్న పల్లెటూరు. చుట్టూ చెట్ల మధ్య చిన్న ఊరు. పేదగా కనిపించినా, ఎల్లప్పుడూ శుభ్రంగా అందంగా ఉండే ఇల్లు. ఇంటి చుట్టూ విశాలమైన ఆవరణ. ఆవరణలో రకరకాల చెట్లు.

వేదమ్మ నిట్టూర్చింది. తరువాత చీరె చెరుగుతో నుదురు తుడుచుకున్నది. రెండు సంవత్సరాల క్రిందట తాను ఇక్కడికి వచ్చేముందు... భర్తకు జబ్బు చెయ్యకముందే

ఇంటి ముంగిట నాలుగు కొబ్బరి చెట్లు నాటింది. అవి ఇప్పుడు ఎలా ఉన్నాయో? ఆ చంద్రప్పన్ మంచివాడే గాని శుద్ధ సోమరిపోతు. బడిలో పిల్లలకు సరిగా పాఠాలు చెప్పడానికే వాడికి బద్ధకం. ఎంతసేపూ పొగాకు నములుతూ, సినిమా కబుర్లు చెబుతూ తిరగడం తప్పిస్తే వాడికి మరో ధ్యాసే లేదు. ఏదో బడిపంతులు కదా అని తప్ప వాడి మీద ఎవరికి సదభిప్రాయమే లేదు. తాను ఇక్కడికి వచ్చేముందు చంద్రప్పన్ కాళ్ళవేళ్ళాపడి బతిమలాడితే దయతలిచి 'సరే పిల్లాపాపా కలవాడివి. అంతగా ప్రాధేయపడుతున్నావు కాబట్టి ఇల్లు నీకు అప్పగిస్తున్నాను. కాని, జాగ్రత్తగా ఉండాలి సుమా? ఇంటిపని శ్రద్ధగా చూసుకో. మీ ఆవిడ నీ కంటె బద్ధకస్తురాలు నాకు తెలుసుగా దాని సంగతి పిల్లలకు స్నానం కూడా చేయించకుండా ఊరిమీద తిప్పుతూ ఉంటుంది. దానికి గట్టిగా చెప్పు. ఇంటిని శుభ్రంగా ఉంచుకోండి. మళ్ళీ నేను తొందరగానే వచ్చేస్తాను. ఎల్లకాలమూ పరాయి దేశంలో ఉండను కదా! ఎప్పటికయినా ఇక్కడ మట్టికావలసిన దాన్నే. ఇల్లు ఇప్పుడెట్లా ఉందో, నేను మళ్ళీ వచ్చేసరికి అట్లాగే ఉండాలి అన్నది తాను. చంద్రప్పన్ అప్పుడన్నింటికి తల ఊపాడు. కాని తనకు నమ్మకం లేదు. ఎప్పుడూ ఒక్క సాలెగూడయినా లేకుండా శుభ్రంగా కళకళలాడుతూ ఉండే ఇల్లు. ఇప్పుడెట్లా ఉందో ఏమో? ఇంటి వెనక ఆవరణలో మూలగా పెద్దలెవరో ఎప్పుడో వేసిన మామిడి చెట్టున్నది. అది కాలం వచ్చేసరికి విరగ కాస్తుంది. తాము తినగలిగినన్ని తిని ఊరంతటికీ పంచేవారు. అది ఇప్పుడెట్లా ఉందో? చంద్రప్పన్ తానిక్కడికి బయలుదేరి వచ్చేముందు చాలా వాగ్దానాలు చేశాడు. ఇల్లు జాగ్రత్తగా చూసుకుంటాననీ, ఊరి చివర ఉన్న రెండురకాల మెట్ట పొలంమీద వచ్చే ఆదాయం రైతు దగ్గర వసూలుచేసి సకాలంలో పంపిస్తాననీ, మామిడిచెట్టు మీద కూడా ఆదాయం చూపిస్తాననీ గట్టిగా చెప్పాడు. కాని, రెండు సంవత్సరాలు దాటింది. ఇంతవరకూ అక్కడినుంచి ఎర్రని ఏగానీ కూడా రాలేదు. ఉత్తరం వ్రాయిస్తే సమాధానమేలేదు. కొడుకును 'పోని, ఒకసారి వెళ్ళి చూసిరా, నాయనా' అంటే అతడేమో నవ్వి 'ఎందుకమ్మా? అంతదూరం డబ్బు ఖర్చు పెట్టుకొనిపోతే వచ్చేదెంత చెప్పు? పదో పాతికో వచ్చేను. దానికోసం వందలు ఖర్చుపెట్టడం దండుగకదూ?' అంటాడేగాని, అతనికి ఇల్లూ, పొలమూ ముఖ్యం కాదు. అతనికా మమకారమే లేదు.

వేదమ్మ లేచి నెమ్మదిగా ముందు గదిలోకి వచ్చింది. ఆ గది చాలా చిన్నది. ఒక వైపున చిన్న టేబిలూ, దాని ముందొక పాతకుర్చీ మూసిన బట్టలు తలుపులపైనా దణ్ణెంపైనా వేలాడుతున్నాయి. కిటికీలో నుంచి కాస్తంత వెలుతురు లోపలపడుతున్నది. అల్మారాలో నాలుగు అరలూ నాలుగు అరణ్యాలలా ఉన్నాయి. పై అరలో పరమశివన్ పాతచదువుకు సంబంధించిన పనికిరాని పుస్తకాలు చిందరవందరగా ఉన్నాయి. రెండో అరలో ఏవేవో కాగితాలు, క్రింద అరలో చిరిగిన బట్టలు, ఒక పగిలిపోయిన సిరాబుడ్డి, కళాయిపోయి మాసిపోయిన చిన్న అద్దం, తిలకం సీసా.

టేబిల్ పైన పాత ఫోటో వుంది. దాని ఫ్రేము పాతబడి వెలిసిపోయి వుంది. లోపలికి పురుగులు పోయి కొట్టివేసినందువల్ల ఫోటోలో చాలా రంధ్రాలు పడ్డాయి. ఒక పెద్ద రంధ్రం సరిగా వైద్యనాథన్ నుదుట వుంది.

వేదమ్మ నెమ్మదిగా ఆ ఫోటోను అందుకుని చీరె చెరుగుతో తుడిచి కళ్ళకు దగ్గరగా ఉంచుకుని చూసింది.

ఫోటోలో వెనక తమ ఇల్లు. కుడిపక్కన ఒక చెట్టు.

వైద్యనాథన్ తలపాగాతో, నుదుట విభూతితో, చేతి కర్రతో దర్జాగా, హుందాగా కుర్చీలో కూర్చుని ఉన్నాడు. తాను ఎప్పటిదో పెళ్ళినాటి కంచిపట్టు చీరె కట్టుకుని వుంది. అది కనకాంబరం రంగుచీరె, తనకిప్పటికీ గుర్తే. ఫోటోలో తన ముఖం కళకళలాడుతున్నది. చిరునవ్వును పెదవుల మధ్య బిగించి, కుర్చీమీద ఒక చెయ్యి అనించి నిలబడి వుంది.

ఆనాడు ఒక పెద్ద మనిషి తన ఇంటికి వచ్చాడు. ఆయన చాలా కాలంపాటు ఏదో తగ్గని జబ్బుతో బాధ పడ్డాడు. ఎందరి దగ్గిర ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేక ఆశ వదులుకున్నప్పుడు, ఎవరో చెప్పగా వచ్చి వైద్యనాథన్ దగ్గర మందు తీసుకున్నాడు. నెలరోజుల్లో జబ్బు తగ్గి అతడు మామూలు మనిషైనాడు. ఇక అతని ఆనందం చెప్పనలవి కాదు. ఒకనాడు వచ్చి తన వ్యాధి నయం చేసినందుకు కృతజ్ఞత తెలుపుకుని, డబ్బు ఇచ్చి, వెళ్ళిపోయేముందు తన దగ్గర కెమేరా ఉందనీ, తమ ఫోటో తీస్తాననీ అన్నాడు వైద్యనాథన్. వద్దంటే అతను వినలేదు. దంపతులిద్దరూ పార్వతి పరమేశ్వరుల్లాగా ఉన్నారనీ, ఫోటో తీసి తన దగ్గర ఎల్లకాలం అట్టే పెట్టుకుంటాననీ అన్నాడు. మరునాడు నిజంగానే కెమేరా పట్టుకుని వచ్చాడు. వైద్యనాథన్‌కు ఫోటో దిగడం ఇష్టంలేదు. అంతకు ముందెన్నడూ వారు ఫోటో తీయించుకోలేదు. వేదమ్మకుమాత్రం లోలోపల ఫోటో అంటే సంబరంగానే ఉంది. కాని, భర్త ఒప్పుకోడేమోనని సందేహించింది. వైద్యనాథన్ చివరికి మెత్తబడి 'సరే' అన్నాడు. ఎన్నడూ లేనిది చొక్కా వేసుకున్నాడు. తలపాగా చుట్టాడు. నుదుట దట్టంగా విభూతి పట్టించాడు. మెడలో హారం లాగా పైపంచే వేసుకున్నాడు. ఈ లోపల తను కూడా పట్టుచీరె కట్టుకుని సిద్ధమైంది. ఒక అరగంట ప్రయాసపడి తరువాత ఒక్క క్షణంలో 'క్లిక్' మనిపించి ఆ పెద్దమనిషి వెళ్ళిపోయాడు. మరో మూడు రోజుల తర్వాత యీ ఫోటో వచ్చింది. ఆ నాడల్లా వేదమ్మ ఎంతో సంబరపడి పోయింది.

వేదమ్మ ఉలిక్కిపడింది. మీనాక్షి లోపలినుంచి ఎప్పుడు వచ్చిందో ఏమో గుమ్మంలో నిలబడి "రండి అత్తయ్యా! చారు వేసుకుని నాలుగు మెతుకులు తిందురుగాని. ఆ తరువాత మాత్ర వేసుకోవచ్చు" అని పిలుస్తున్నది.

"నువ్వు కానీయ్, అమ్మా! నాకు ఆకలిలేదు. లంఖణం ఉంటే మంచిది" అన్నది వేదమ్మ.

మీనాక్షి ఏమనుకున్నదో ఏమో లోపలికి వెళ్ళిపోయింది.

గోడమీద కొడుకు పెళ్ళి ఫోటో ఉంది. వేదమ్మ కొద్ది క్షణాలు దానివంకనే కళ్ళార్పకుండా చూసింది. పరమశివన్ పెళ్ళికొడుకువేషంలో కుర్చీలో కూర్చుని ఉన్నాడు. మీనాక్షి పెళ్ళి బట్టలతో, నుదుట కళ్యాణ తిలకంతో కుర్చీ పక్కనే నిలబడి ఉంది. ఇద్దరిలో ఎవరూ నవ్వడంలేదు. వేదమ్మ కోడలు బొమ్మవంక పరిశీలనగా చూసింది. మీనాక్షి బాగానే ఉంటుంది. మంచి అణకువ కలిగిన పిల్ల కూడా. కాకపోతే వైద్యనాథన్ మాత్రం చనిపోయేవరకూ మనస్సులో బాధపడుతూనే ఉన్నాడు. ఆ బాధను ఆయన దాచుకోలేదు. తనతో అంటూనే ఉండేవాడు. కొడుకు చేసిన నేరం కూడా ఏమి లేదు. తండ్రి కుదిర్చిన

సంబంధం చేసుకోనన్నాడు. ఆ పిల్ల పేరు వేదమ్మకు సరిగా గుర్తులేదు. బేబీ అని కాబోలు పిలిచే వారందరూ. అసలు పేరు సుజాతో, సుమిత్రో గుర్తులేదు. సంపన్నుల పిల్ల. బోలెడు కట్నం ఇస్తామన్నారు వారు. పెళ్లికాగానే పరమశివన్ ఆ చుట్టుపక్కలే తమ పలుకుబడి ఉపయోగించి మంచి ఉద్యోగం కూడా ఇప్పిస్తామన్నారు. ఉన్న ఊరూ, దేశం కదలకుండా కొడుకూ, కోడలూ తమ కళ్ళముందే ఉంటారనీ, వృద్ధాప్యంలో అండగా ఉంటారనీ వైద్యనాథన్ ఎంతగానో ఆశలు పెట్టుకున్నాడు కాని, పరమశివన్‌కు అప్పటికే డిగ్రీ పుచ్చుకుని గవర్నమెంటు ఉద్యోగాలకు దరఖాస్తులు పెట్టి కూర్చుని దేశంలో ఎక్కడికైనా వెళ్ళిపోవాలి అన్నట్టు సిద్ధంగా ఉన్నాడు. తండ్రి ఆ సంబంధం గురించి చెప్పగానే ముందు పెళ్ళి వద్దన్నాడు. తరువాత కట్నం తీసుకోనన్నాడు. ఆ పైన తనకాసంబంధం ఇష్టం లేదన్నాడు. వైద్యనాథన్ కొడుకును బలవంత పెట్టలేదు గాని లోలోపల చాలా బాధ పడ్డాడు. తరువాత పరమశివన్‌కు ఉద్యోగం వచ్చి దూరదేశానికి వెళ్ళిపోతున్నాడని మరింత బాధపడ్డాడు. కొన్నాళ్ళ తరువాత కొడుక్కు నచ్చిన సంబంధం తప్పనిసరై చేశాడేగాని, లోలోపల ఆయనకు కోపం, బాధమాత్రం తగ్గలేదు. చివరకు గుండె జబ్బుతో హఠాత్తుగా గంటల మీద చిలక ఎగిరిపోయింది. పరమశివన్ ఊరికి చేరుకునేసరికి అంతా అయిపోయింది. అంతసేపు శవాన్ని పెట్టుకుని కోర్చోవడం కష్టమైపోయింది.

వేదమ్మకు ఒకటే తృప్తి. ఎక్కడయితేనేం? కొడుకు సుఖంగా ఉండటమే ఆమెకు కావలసింది. కాకపోతే తాను స్వంత ఊరు వదిలి, దేశం కాని దేశంలో పరాయి వాళ్ళ మధ్య ఉండవలసి రావడం ఒక్కటే ఆమెకు కించిత్ బాధ కలిగించింది. చుట్టూ ఉన్నవాళ్ళందరూ మంచి వాళ్లే. కలుపుగోలుగా ఉండేవాళ్లే. కానీ, ఇప్పటికి వేదమ్మకు మాత్రం లోపల బాధగానే ఉంటుంది. ఆమెకు తన ఊరు, ఆ ఊరిగాలి, అక్కడి చెట్టూ చేమలూ, అక్కడి ఆకాశం, అక్కడి మనుషులు ఎంతో దగ్గర. ఆమె జీవితమంతా అక్కడే గడచింది. భూమి మీద పడింది మొదలు పుట్టిల్లు, మెట్టినిల్లు తప్ప మరెక్కడకి వెళ్లి ఎరుగదు. జీవితంలో అతి ముఖ్యమైన పురుళ్ళు, పుణ్యాలు, కష్టాలు, సుఖాలు, కన్నీళ్ళు పేరంటాలు, పసుపు కుంకుమలు, వంటలు, చావులు - అన్ని అక్కడే.

వేదమ్మకు గుండెలో కలుక్కుమన్నట్టయింది. గుండెలో ఏ మూలనో బాధ, నరం కదిలినట్టు బాధ....

అంతలో పక్క ఇంటి వర్ధనమ్మ కొడుకు, చివరివాడు "మామీ, అమ్మ రమ్మంటున్నది" అంటూ వచ్చాడు.

వేదమ్మ కదిలి వస్తున్నా, పద అన్నది. వాడు ఈల వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

వర్ధనమ్మది కూడా తమ ప్రాంతంలోనే ఏదో ఊరు. ఆమె భర్త కూడా రైల్వే ఉద్యోగి. అయితే, పరమశివన్ చేస్తున్నదానికంటె కొంచెం పెద్ద ఉద్యోగం. మనిషి చాలా మంచివాడు. అతిశయం, గర్వం ఏ మాత్రం లేవు. ఇతరులకు కష్టంవస్తే విలవిలలాడి పోతాడు. వర్ధనమ్మ కూడా చాలా కలుపుగోలుమనిషి. ఇక్కడ చాలా ఏళ్ళనుంచి ఉండిపోయి నందులవల్ల ఇంట్లో అందరికి తెలుగే అలవాటపోయింది. ఎవరూ వారిని తమిళులని అనుకోరు. వర్ధనమ్మకు నలుగురు పిల్లలు. అంతా ఇక్కడే పుట్టి పెరిగారు. పెద్దవాడు విశాఖపట్నంలో ఏదో పెద్ద చదువు చదువుతున్నాడు. తరువాతి పిల్లకు పెళ్ళిచేసి

అత్తవారింటికి పంపించారు. అల్లుడు ఒరిస్సాలో ఎక్కడో ఉద్యోగం చేస్తున్నాడు. ఇంకా కాపురం పెట్టలేదు. మూడోవాడు స్థానిక కళాశాలలో బి.ఎస్.సి. చదువుతున్నాడు. చివరి వాడు అరేళ్ళవాడు, మణి. స్కూల్లో చదువుతున్నాడు.

వేదమ్మకు తలుచుకుంటే ఆశ్చర్యంగా ఉంటుంది. వర్ధనమ్మ, ఆమె మొగుడు, పిల్లలు ఎవరికీ తమ ఊరే గుర్తురాదు. వారిది తిరుచ్చిలో ఏదో ఊరు. అక్కడ కొంచెం పొలం, ఇల్లు ఉన్నాయి. పిత్రార్జితమైన వాటినీ, ఆ ఊరినీ వాళ్లు పూర్తిగా వదిలేసినట్టే లెక్క. ఆ ఇంట్లో ఎవరుంటున్నారో, ఆ పొలం ఎవరు చేసుకుంటున్నారో వారికి అసలు తెలియదు; పట్టించుకోరు. ఒక పర్యాయం వేదమ్మ ఆ మాట అంటే వర్ధనమ్మ నిట్టూర్చి "అవన్నీ ఇక మరిచిపోవలసిందే, మామీ! స్వంత ఊరు, ఆస్తి, మమకారం అవన్నీ ఇకసాగవు. రోజులు మారుతున్నాయి. ఇంకా మారుతాయి. ఎక్కడో పుట్టడం, మరెక్కడో కడుపు చేతపట్టుకుని పోవడం తప్పదు. ఉదాహరణకు మా అమ్మడి సంగతి తీసుకో ఇక్కడే పుట్టి ఇక్కడి పెరిగింది కదా? ఇప్పుడు ఒరిస్సాలో ఉండాలి. ఏం చేస్తాం? తప్పదు "మరి" అని కొంచెం అగి, మళ్ళీ నెమ్మదిగా –"మా ఊరు, మా యిల్లు నాకు ముఖ్యమే. అక్కడి బంధువులు కూడా ముఖ్యమే. కాని, ఇంత దూరం ఏదో ప్రవాహంలో పడి కొట్టుకు వచ్చేశాం. అక్కడి మా వాళ్ళందరూ ఎట్లా ఉన్నారో, ఏం చేస్తున్నారో, ఎవరున్నారో, ఎవరు పోయారో మాకు తెలియనే తెలియదు. బొత్తిగా సంబంధాలు లేవు. ఇక ఎక్కడుంటే అదే మన ఊరని సర్దిపెట్టుకోవలసిందే. అంతకు మించి చేసేదేమీ లేదు" అన్నది.

వేదమ్మ గుమ్మంలో నిలబడి "అమ్మా! ఆ వర్ధనమ్మగారెందుకో రమ్మన్నది, వెళ్లొస్తాను" అని తలుపు దగ్గరికి లాగి నెమ్మదిగా నడిచి పక్క యింటికి వచ్చింది. వారు వుంటున్న యిల్లు కొంచెం పెద్దది. వేదమ్మ లోపలకు అడుగుపెట్టేసరికి ముందు హాల్లో కొయ్యగుర్రం ఎక్కి వూగుతున్న మణి "అమ్మా! మామిగా రొచ్చారు" అని రాగం తీస్తూ లోపలికి వెళ్ళాడు.

అంతలో వర్ధనమ్మ చీరె కొంగుకు చేతులు తుడుచుకుంటూ ముందు హాల్లోకివచ్చి హడావిడిగా – "మామీ! ఇప్పుడే పోస్టువాడు కార్డు యిచ్చి వెళ్ళాడు. నాకు సరిగా అర్థం కావడంలేదు. కాస్త నువ్వు చదివిపెట్టు" అన్నది బల్లమీద కార్డు వేదమ్మకి అందిస్తూ.

వేదమ్మ కార్డును అందుకుని అటూ ఇటూ తిప్పి చూసింది. ఆమెది అంతంత మాత్రపు చదువు. ఆ ఉత్తరంలో వ్రాత క్లుప్తంగానే ఉన్నా గజిబిజిగా ఉంది.

వేదమ్మ – నాకు కళ్ళు సరిగా కనిపించవు, జోడు పగిలి పోయిందిగా మొన్న? మీనాక్షిని పిలుస్తాను" అంటూ కోడలు కోసం మణిని పంపించింది. వాడు రైలులాగా "కుయ్' మని అరుస్తూ పరుగెత్తి పోయాడు.

వేదమ్మ ఆ ఉత్తరం వంకనే చూస్తూ కూర్చుండిపోయింది. వర్ధనమ్మ అందులో విషయం తెలియక ఆదుర్దాగా అలాగే గుమ్మాని కానుకుని నిలబడి వుంది.

రెండు నిమిషాలు గడిచాయి. ఇంతసేపూ వేదమ్మ మనసులో తమ ఊరూ, తమ ఇల్లూ, అక్కడి పరిసరాలూ. ఆకాశం, చెట్లూ, చేమలూ కదులుతున్నాయి. అక్కడి గాలి అద్భుతమైన సంగీతం పాడుతున్నట్టు వీచేది. ఆ సముద్రం దూరతీరాల గాథలను అరవంలో పాడి వినిపిస్తున్నట్టు ఘోషిస్తూ ఉండేది. అక్కడి పక్షులు తీయనైన అరవంలో రాగాలు తీస్తూ ఉండేవి.

అంతలో మీనాక్షి వచ్చి "ఏమిటి సంగతి పిన్నీ?" అని అడిగింది. వర్ధనమ్మ ఆదుర్దాగా కార్డు అందుకుని ఆమె కిచ్చి చదివిపెట్టు తల్లీ" అన్నది.

మీనాక్షి కార్డు అందుకుని చదవడం ప్రారంభించింది. ఒక్కనిముషం బరువుగా గడిచింది. వేదమ్మ, వర్ధనమ్మ ఆమెవంక, కదులుతున్న ఆమె పెదవుల వంక అదుర్దాగా చూస్తూ ఉండిపోయారు.

మీనాక్షి– "మంచివార్త కాదు పిన్నీ, మీ బాబాయిగారు...భూతలింగంగారు...వారం రోజులయింది పోయారట. కొడుకు ఉత్తరం రాశాడు" అన్నది కార్డు చించివేస్తూ.

వర్ధనమ్మ గుమ్మానికానుకుని "భూతలింగం బాబాయి...అయ్యో పోయాడా" అని మాత్రం అన్నది. అంతలోనే ఆమె కళ్ళు ఆర్ద్రములైనాయి.

కొద్ది క్షణాలాగి, "ఎంతో మంచివాడు, మామీ! పెద్ద వయసు కూడా వుండదు. అరవై లోపే. మహావుంటే యాభై ఎనిమిదేళ్ళు వుంటాయి. నన్ను చిన్నప్పుడు ఎత్తుకుని తిప్పేవాడు. మనిషి రాయిలాగా, ఆరోగ్యంగానే ఉండేవాడు. పిల్లల్లేరు. పెళ్ళాం పోయింది. నాకు తెలిసి ఒక్కసారి మాత్రం పెద్ద జబ్బు చేసింది. బతకననేవాడు. ఎన్ని మందులు వాడినా లాభం లేకపోయింది. చివరకు ఎవరో చెప్పారని ఏదో పెల్లెటూళ్ళో ఒక ఆయుర్వేద వైద్యుడి దగ్గర మందు తిన్నాడు. కొద్ది రోజుల్లో జాడ లేకుండా పోయింది. అన్నట్టు, ఇంట్లో ఒక ఫోటో ఉండాలి, నాకు గుర్తు వస్తున్నది. అది ఆయన తీసిందే. ఆ వైద్యుడి ఫోటో భార్యతో సహా తీశాడు. అతన్ని గురించి చాలా పొగుడుతూ వుండేవాడు. ఎప్పుడూ కెమేరా ఒకటి మెడలో వేసుకుని, తిరుగుతూ ఉండేవాడు. అయ్యో! పాపం పోయాడా?" అన్నది కనుతుదలు తుడుచుకుంటూ.

వేదమ్మ కళ్ళు పెద్దవిచేసి "ఏది ఫోటో అది?" అని అడిగింది. కాని వర్ధనమ్మ అంతలోనే హడావుడిగా "ఇప్పుడేం చెయ్యాలి. మామీ!అక్కడికా వెళ్ళలేము. ఏం చెయ్యాలి?" అన్నది.

మీనాక్షి నెమ్మదిగా– "ఏముంది చేసెందుకు? అంతా అయిపోయింది. కదా! ఒక కార్డు ముక్క రాసి పడెయ్యండి" అన్నది.

"అవును, అంతే. అంతా అయిపోయిందిగా! ఇక మనం చేసేదేముంది? బహుశా ఎవరినో పెంచుకుని ఉంటాడు. అతనేగా యీ ఉత్తరం రాసింది? అతనెవరో మనకు తెలియదు. ఒక కార్డు రాసి పడేస్తే సరి. మాకు స్నానం వగైరా లేవీ ఉండవుగా? అవున్లే. లేవు, అన్నట్టు ఆ ఫోటో...అదెక్కడ ఉందబ్బా!" అంటూ వెదకడం ప్రారంభించింది.

మీనాక్షి ఈ లోపల "అత్తయ్యా! ఎట్లావుంది ఒంట్లో?" అంటూ వేదమ్మ దగ్గరికి వచ్చి నుదుట చెయ్యివేసి, "చెమట పోస్తున్నది. జ్వరం తగ్గినట్టే. ఆ మాత్ర వేసుకోండి. రండి పోదాం." అన్నది.

వేదమ్మ లేవలేదు "వెళదాం వుండు" అని వూరుకున్నది. ఈ లోపల వర్ధనమ్మ వెదుకులాట ఫలించినట్టున్నది. క్రింది సొరుగులోంచి ఒక ఫోటో పైకి తీసి నవ్వుతూ, "ఇదుగో, మా బాబాయి తీసిన ఫోటో. ఆ వైద్య దంపతులది" అంటూ వేదమ్మ దగ్గరి కొచ్చింది.

వేదమ్మ దాన్ని అందుకుని చూసింది. ఇది తమ యింట్లో ఉన్న దానివలె మరీ పాతబడిపోలేదు.

అంతలోనే మీనాక్షి తల తిప్పి ఆ ఫోటో వంక చూసి, "ఈ ఫోటో...ఇది మీ ఇంట్లోనూ ఉందా?" అని ఆశ్చర్యబోయి తరువాత నవ్వుతూ వర్ధనమ్మ వంక తిరిగి, "ఈ ఫోటో మా ముందుగదిలో బల్ల మీద చూడలేదూ. పిన్నీ?" అంటూ ఫోటోమీద వేలు వుంచి, "ఇదెవరో చెప్పండి చూద్దాం" అన్నది.

వర్ధనమ్మ శ్రద్ధగా చూసి "అరె, మామీ...నువ్వేనా?...మీవారేనా ఆ డాక్టరు! మా బాబాయి తెగ పొగిడివాడు" అన్నది.

వేదమ్మ లేచింది. ఇప్పుడామె కళ్లనిండా నీళ్లున్నాయి. ఏదో మాట్లాడబోయింది కాని, గొంతు పెగలలేదు.

కొన్ని క్షణాల తరువాత మీనాక్షి "రండి. పోదాం" అని అత్తగారిని నడిపించుకుని ఇవతలికి వచ్చింది. అత్తా కోడళ్ళిద్దరూ తమ వాటాలోకి వెడుతూ ఉండగా వేదమ్మ హఠాత్తుగా వీథిలోకి చూసింది. ఒక్క క్షణం కదలకుండా అలాగే నిలబడిపోయింది.

ఎవరో పోయినట్టున్నారు. నలుగురు మనుషులు మోసుకుపోతున్నారు. ముందు కుండ పట్టుకుని తడి గుడ్డలతో ఒక యువకుడు నడుస్తున్నాడు. ఎవరిదో అంతిమ యాత్ర ఆ విధంగా నిశ్శబ్దంగా కొనసాగుతున్నది. వీథిలో జన సంచారం మామూలుగానే వుంది. బస్సులూ, రిక్షాలూ వస్తూ పోతూనే ఉన్నాయి. శవం వెనక ఇద్దరో, ముగ్గురో నడుస్తున్నారంతే.

వేదమ్మ కోడలితో నెమ్మదిగా – "ఇక్కడ శ్మశానం చాలా దూరం కాబోలు" అన్నది.

మీనాక్షి ఒక్కసారి అత్తగారి కళ్ళలోకి చిత్రంగాచూసి, "అవును రెండు, మూడు మైళ్ళుందనుకుంటాను. నాకు సరిగా తెలియదు. మీరు లోపలికి రండి. కాస్త నాలుగు మెతుకులు తింటే మంచిది" అన్నది.

వేదమ్మ లోపలికెళ్ళి మాత్ర వేసుకుని నీళ్ళు తాగింది. తరువాత "కాస్సేపు నడుం వాల్చి లేచి అప్పుడు ఆకలయితే చారూ అన్నం తింటాను. లేకపోతే లంఖణమే మంచిది" అన్నది చాపమీద పడుకుంటూ.

మీనాక్షి మరో పక్కన మంచంలో కూర్చుని పుస్తకం చేతిలోకి తీసుకుంది. పిచ్చికలు రెండు మూడు కిటికిలో నుంచి ఎగిరి వస్తూ మళ్ళీ బయటికి పోతూ హడావిడి చేస్తున్నాయి. దూరంగా వేగంగా వస్తున్న బస్సు హోరను ధ్వని ఆగకుండా కర్ణ కఠోరంగా వినిపిస్తున్నది.

ఉన్నట్టుండి వేదమ్మ ఒక చేతి మీద కొంచెం లేచి, "అమ్మా! మీనా! నా దగ్గర వచ్చి కూర్చో కాస్సేపు" అన్నది.

మీనాక్షి లేచి చేతిలో పుస్తకంతోనే వచ్చి అత్తగారి పక్కన కూర్చుంది.

వేదమ్మ, కోడలి చెయ్యి పుచ్చుకుని హఠాత్తుగా "మన వూళ్ళో శ్మశానం వూరికి చాలా దగ్గర. బావి దాటి చెట్ల మధ్యగా వెళ్ళాలి. ఒక సారెప్పుడో మా మారిది – మీ మామగారికి వరసకు తమ్ముడులే – పోతే అతని భార్యను పట్టుకోలేకపోయాం. అప్పుడు ఆమెను బలవంతంగా వెనక్కు లాక్కు వచ్చామనుకో. ఆ దోవలో చెట్లు ఎత్తుగా ఉంటాయి" అన్నది.

మీనాక్షి పుస్తకంలోకి చూస్తున్నదేగాని, ఆమె గుండెలు భయంతో గుబగుబ లాడాయి. అనుమానంగా అత్తగారి ముఖంలోకి చూసింది.

మళ్ళీ వేదమ్మ "నేను పెద్దదాన్నయిపోయాను కదా! ఇక్కడే కన్ను మూస్తాను. అప్పుడు మన పరము నన్ను యిక్కడే..." అంటూ ఆగిపోయింది. ఆ తరువాత ఆమె గొంతు పూడుకుపోయింది.

మీనాక్షికి మతిపోతున్నట్టయింది. ఆశ్చర్యంలోనుంచి తేరుకుని అత్తగారి నుదుట చెయ్యి, ఉంచి "పడుకోండి కాస్సేపు" అన్నది.

వేదమ్మ తల వూపిందేగాని, వెంటనే పడుకోలేదు. మళ్ళీ నెమ్మదిగా..." నే నిక్కడే పోవడం ఖాయం. అప్పుడు వాడు అంత ఖర్చుపెట్టి ఈ కట్టెను అంత దూరం మన వూరికి తీసుకుపోతాడా? ఇబ్బంది కదూ? అందుకని ఇక్కడే...అంతేలే...అంతకన్నా చేసే దేముంది? వర్ధనమ్మ చెప్పిందే నిజం. రోజులు మారుతున్నాయి. మనమూ మారాలి. ఇలాంటివన్నీ వదులుకోకపోతే కుదరదు. అంతే. అవన్నీ భ్రమలు. పాతకాలపు భ్రమలు. ప్రాణం పోయిన తర్వాత కట్టెను ఎక్కడ మట్టి చేస్తేనేం?" అన్నది గొణుగుతున్నట్లు.

ఆమెకు అంతలో నిద్ర ముంచుకు వచ్చింది. కదలకుండా బరువుగా ఊపిరి తీస్తూ పడుకుండిపోయింది. నిద్రలో ఆమెకు రెండు చిన్న కలలు వచ్చాయి. తన వూళ్ళో ఇళ్ళన్నీ మాయమైపోయాయిట. ఇక్కడ ఇప్పుడంతా గంధపు చెట్లు దట్టంగా లెక్క లేవన్ని పెరిగి ఉన్నాయట.

ఆమె నిద్రలో అటునుంచి ఇటు తిరిగి పడుకున్నది. మరి కాస్సేపటిలో రెండో కల. ఆకాశంలో అంగుళమైనా ఖాళీలేకుండా అసంఖ్యాకంగా లక్షలూ కోట్లాదిగా కాకులు క్రిక్కిరిసి కనిపించాయి. అవన్నీ నిశ్శబ్దంగా ఉన్నాయిట.

వేదమ్మ మళ్లీ మరోవైపు తిరిగి పడుకుంది. మీనాక్షి అత్తగారి నుదుట చెయ్యివుంచి చూసి, 'జ్వరం తగ్గిపోయింది' అనుకున్నది తనలో.

వేదమ్మ ప్రశాంతంగా నిద్రపోతున్నది. కలలు లేని నిద్ర పోతున్నది.

◆ ◆ ◆